నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి


హయత్‌నగర్: అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి

తుర్కయంజాల్ : నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. బుధవారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధతో కలిసి పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. బ్రాహ్మణపల్లిలోని 6వ వార్డు ఇందిరమ్మ కాలనీలో సీసీరోడ్డు, అంతర్గత డ్రైనేజీ, మునగనూరు 15వ వార్డులో సీసీ రోడ్డు, అంతర్గత డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. మొత్తంగా రూ.కోటి 88 లక్షల అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ గుండ్లపల్లి హరిత, మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీ, కౌన్సిలర్లు కొంద్రు మల్లేష్, తాళ్లపల్లి సంగీత, వేముల స్వాతి, బ్యాంకు డైరెక్టర్ స్వప్న శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మంచాల: ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు చీరాల రమేష్ అన్నారు. మంచాల మండల పరిధిలోని లింగంపల్లి గ్రామంలో ఎమ్మెల్యే నిధులు రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం పనులను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్న ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నేడు అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు పోతుందన్నారు. మారుమూల గ్రామాలకు సైతం రోడ్డు, రవాణ వ్యవస్థను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనేక పరిశ్రమలను తీసుకొని రావడం జరిగిందన్నారు. ఇవన్నీ ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి వల్లే సాధ్యమయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో లింగంపల్లి సర్పంచ్ వినోద, వార్డు సభ్యులు ఐలేశ్, స్వప్న, కరుణాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బహదూర్, నాయకులు ప్రభాకర్, మంజుల, పరమేష్, వాసవి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పౌష్టికాహారం తీసుకోవాలి

ఐసీడీఎస్ సీడీపీఓ శాంతిశ్రీ


మహిళలను సన్మానిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

యాచారం: మహిళలు పౌష్టికాహారం తీసుకోవాలని ఇబ్రహీంపట్నం ఐసీడీఎస్ సీడీపీఓ శాంతిశ్రీ పేర్కొన్నారు. మండల పరిధిలోని నందివనపర్తి అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం సుపోషణ–అన్నప్రాసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు చిరుధాన్యాల ఆహారాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం మహిళలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశ సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఆర్‌పై వైద్య సిబ్బందికి అవగాహన


సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

ఇబ్రహీంపట్నం: జిల్లా వైద్య శాఖ ఆధ్వర్యంలో లైఫ్ సేవింగ్ టెక్నిక్‌పై వైద్య సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించినట్లు ఇబ్రహీంపట్నం డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ధరణికుమార్ తెలిపారు. డివిజన్ పరిధిలోని ఇబ్రహీంపట్నం పీపీ యూనిట్, దండుమైలారం, ఎల్మినేడు, మంచాల, ఆరుట్ల పీహెచ్‌సీల్లోని వైద్య సిబ్బందికి, ఆశ వర్కర్లకు కార్డియో పల్మొనరీ రిససీటేషన్ ఆటోమేటిక్ ఎక్స్‌టర్నల్ డిఫ్రిలేటర్(సీపీఆర్–ఏఈడీ)పై శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. డా.నాగయ్య, డా.ప్రియాంక శిక్షణ ఇచ్చారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ


చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ కసిరెడ్డి

ఆమనగల్లు: మాడ్గుల మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన లాయిస్‌రెడ్డికి ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి పథకం కింద రూ.లక్ష చెక్కు మంజూరైంది. హైదరాబాద్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో బుధవారం ఎమ్మెల్సీ కసిరెడ్డి.. లాయిస్‌రెడ్డికి చెక్కు అందించారు. నాయకులు సురేందర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, జగన్, విజయ్, బాబా తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆర్టీసీ ఆర్‌ఎం వరప్రసాద్

హయత్‌నగర్: బస్ స్టాండ్‌లలో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని, చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రయాణికుల దాహార్తిని తీర్చడం గొప్ప విషయమని ఆర్టీసీ హైదరాబాద్ రీజనల్ మేనేజర్ వరప్రసాద్ అన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో హయత్‌నగర్ బస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభిచారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధి ఏనుగుల శ్రీకాంత్‌రెడ్డి, డీఎంలు రఘు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వసతుల కల్పనలో విఫలం: సామ

హస్తినాపురం: హస్తినాపురం డివిజన్ పరిధిలో ప్రజలు కనీస వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. సుభాష్‌చంద్రబోస్ కాలనీలో బుధవారం నిర్వహించిన బీజేపీ బూత్ స్వశక్తికరణ అభియాన్‌లో భాగంగా కాలనీలో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సామ మాట్లాడుతూ... సుభాష్‌చంద్రబోస్‌కాలనీలో 160 కుటుంబాలు నివాసముంటున్నాయని, ఇక్కడ ప్రజలు తీవ్ర దుర్భర జీవితాన్ని గడుపుతున్నారన్నారు. ఈ ప్రాంతంలో చిన్నచిన్న డయా ఉన్న డ్రైనేజీ పైప్ లైన్ ఉన్నందున ఎగువ ప్రాంతాల్లోని కాలనీల నుంచి వచ్చే మురుగునీరు జామ్ కావడంతో ఆ మురుగు ఇళ్లలోకి వచ్చే ప్రమాదం ఉందన్నారు. వెంటనే సమస్యను పరిష్కరించకపోతే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టనున్నట్లు హెచ్చరించారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలన్నారు. ఎక్కడ చూసినా డ్రైనేజీ నీరు పొంగిపొర్లుతోందన్నారు. నేతలు నాగన్న, సత్యపాల్‌సింగ్, దామోదర్‌రెడ్డి, మల్లేశ్‌గౌడ్, శేఖర్‌గౌడ్, రాజేందర్, శశిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రధానమంత్రి బీమా యోజనలో చేర్పించాలి

అధికారులతో ఎంపీడీఓ సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాఘవులు

ఆమనగల్లు: సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మాడ్గుల ఎంపీడీఓ రాఘవులు కోరారు. మాడ్గుల మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో అధికారులతో బుధవారం వివిధ పథకాలపై ఎంపీడీఓ సమీక్ష సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష యోజన పథకాల గురించి గ్రామాల్లో అవగాహన కల్పించాలని కోరారు. ప్రతి గ్రామ పంచాయితీ నుంచి దాదాపు 100 మందికి బీమా యోజన చేయించాలని ఆయన కోరారు. గ్రామాల్లో జరుగుతున్న ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులను సకాలంలో పూర్తిచేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్‌బీఐ మేనేజర్ సుధీర్, ఎంపీఓ వేగన్న, ఈజీఎస్ ఏపీఓ నర్సింగ్, ఏపీఎం నర్సింహా, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

మా ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయండి

ఎంపీపీ, జెడ్పీటీసీకి జూనియర్ పంచాయతీ కార్యదర్శుల వినతి


కడ్తాల్: వినతిపత్రం అందజేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

కడ్తాల్: విధుల్లో చేరి 4 సంవత్సరాలు పూర్తయినా నేటికి ప్రభుత్వం జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయలేదని.. వెంటనే రెగ్యులరైజ్ చేయాలని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్‌ను కలిసి వారు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ నియామకం జరిగి నేటికి 4 సంవత్సరాలు పూర్తి కావడం జరిగిందని.. ఇంతవరకు ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఔట్ సోర్సింగ్ విధానాన్ని రద్దుచేసి ప్రస్తుతం ఉన్న వారిని జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా నియమించాలని కోరారు. తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కరించే విధంగా చూడాలని ఎంపీపీ, జెడ్పీటీసీని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణ, ఎంపీఓ మధుసూదనాచారి, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

మాధవరెడ్డికి సత్కారం


జ్ఞాపిక అందుకుంటున్న మాధవరెడ్డి

ఇబ్రహీంపట్నం: కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధనా సంస్థ(క్రీడా) వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం ఆ సంస్థ ప్రతినిధులు రైతులను సన్మానించారు. జిల్లా తరుపున ఆ క్రీడా సంస్థ ప్రగతిశీల ప్రయోగాత్మక రైతుగా నెర్రపల్లి గ్రామానికి చెందిన ఎం.మాధవరెడ్డి ఎంపిక చేసి జ్ఞాపికను బహూకరించి సత్కరించింది. సంస్థ రూపొందించిన.. విత్తే పరికరాలు, కలుపు యంత్రాలు, రోటోవీడార్ తదితర పరికరాలను ఉపయోగించి కూలీల ఖర్చు తగ్గించి మాధవరెడ్డి అధిక దిగుబడులు సాధించారు. ఢిల్లీ నుంచి వచ్చిన పరిశోధన మండలి అధికారుల చేతుల మీదుగా మాధవరెడ్డి ఈ జ్ఞాపికను అందుకున్నారు.

సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేయండి

కమిషనర్‌కు కార్పొరేటర్ వినతి


వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్లు

మీర్‌పేట: సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించాలని మీర్‌పేట కార్పొరేషన్ 14వ డివిజన్ కార్పొరేటర్ ముత్తంగి కరుణానిధి బుధవారం స్థానిక బీజేపీ నాయకులతో కలిసి కమిషనర్ సిహెచ్.నాగేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కరుణానిధి మాట్లాడుతూ.. గత సంవత్సరం మే నెలలో సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేయగా మళ్లీ ఇప్పటివరకు సమావేశం నిర్వహించకపోవడం దారుణమన్నారు. డివిజన్లలో సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు.

పెన్షన్ సెంటర్ ఏర్పాటు చేయండి..

లెనిన్‌నగర్‌లో ఆసరా పెన్షన్ లబ్ధిదారులు చాలా మంది ఉన్నారని.. పెన్షన్ కోసం ప్రతీనెలా మీర్‌పేటకు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారని.. వారి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని లెనిన్‌నగర్ ప్రాంతంలో పెన్షన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని బీజేపీ నాయకులు శ్రవణ్‌కుమార్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఇంద్రావత్ రవినాయక్, రవినాయక్ పాల్గొన్నారు.

నిరుపేదల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హస్తినాపురం: మెరుగైన వైద్య సేవలు పొందేందుకు ఆర్థిక స్తోమత లేని పేదలు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) ఓ వరంలా ఆదుకుంటోందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. హస్తినాపురం డివిజన్ భారతీనగర్‌కు చెందిన కాసోజు బ్రహ్మచారి కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ. 2.25 లక్షలకు సంబంధించిన చెక్కును బుధవారం ఆయన అందజేశారు. భారతీనగర్‌కు చెందిన ఏడు సంవత్సరాల చిన్నారి దేవర్ష్ నిత్యం జ్వరంతో బాధపడుతున్న నేపథ్యంలో ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స అనంతరం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయిన తర్వాత ఆర్థిక పరిస్థితి బాగాలేక వారి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని సంప్రదించారు. స్పందించిన ఎమ్మెల్యే ఆ చిన్నారి ఆపరేషన్‌కు అయిన డబ్బుల వివరాలను సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేయించారు. ఈ క్రమంలో రూ. 2.25 లక్షలను మంజూరు చేయించాయి. కార్యక్రమంలో హస్తినాపురం కార్పొరేటర్ సుజాతానాయక్, బీఆర్‌ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు సత్యంచారి, నేతల కంచర్ల శివారెడ్డి, భాస్కర్, సాగర్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

గట్టుఇప్పలపల్లిలో ఉచిత వైద్య శిబిరం

తలకొండపల్లి: మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లిలో బుధవారం ఉప్పల చారిటబుల్ ట్రస్టు, హైదరాబాద్ కామినేని ఆస్పత్రివారి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 442 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జయమ్మ, వెంకటయ్య, ఉప సర్పంచ్ స్వామి, మాజీ ఎంపీపీ లక్ష్మీదేవిరఘురాం, వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, పాపిరెడ్డి, గౌడసంఘం కల్వకుర్తి నియోజకవర్గ కన్వీనర్ అశోక్‌గౌడ్, శేఖర్, చంద్రమౌళి, కృష్ణ, వెంకటేశ్, హరికిషన్‌రెడ్డి, బుచ్చిబాబు, వైద్యులు పాల్గొన్నారు.

కార్పొరేట్ బ్యాంకులకు దీటుగా డీసీసీబీ

చైర్మన్ మనోహర్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: డీసీసీబీ టర్నోవర్‌ను రూ.1600 కోట్లకు పెంచినట్లు చైర్మన్ బియ్యని మనోహర్‌రెడ్డి తెలిపారు. ఇబ్రహీంపట్నంలో బుధవారం ఆయన ఆయన మాట్లాడుతూ.. మూడేళ్ల క్రితం బ్యాంకు చైర్మన్‌గా తాను పదవీ బాధ్యతలు స్వీకరించినప్పుడు ఉన్న రూ800 కోట్ల టర్నోవర్‌ను నేడు రూ.1600 కోట్లకు తీసుకువచ్చినట్లు చెప్పారు. సుమారు రూ.1100 కోట్ల రుణాలను అందజేసినట్లు తెలిపారు. అన్ని సహకార సంఘాల పరిధిలో నాబార్డ్ సహకారంతో గోదాంల నిర్మాణాలను చేపట్టామని, 80 శాతం గ్రౌండింగ్ జరిగినట్లు చెప్పారు. కర్షక మిత్ర, హౌసింగ్, మారిగేజ్, ఎడ్యూకేషన్ లోన్స్‌ను అందజేస్తున్నామన్నారు. ఎడ్యూకేషన్ లోన్ 10 నుంచి 25 లక్షలు, హౌసింగ్ లోన్ పది లక్షల నుంచి 75 లక్షలు, మార్టిగేజ్ లోన్ 50 లక్షల వరకు ఇస్తున్నట్లు ఆయన వెల్లడించారు. అన్ని సహకార సంఘాల షేర్స్‌పై 6 శాతం డివిడెంట్ ఇచ్చినట్లు తెలిపారు. కార్పొరేట్ బ్యాంకుల ధీటూగా డీసీసీబీని తీర్చిదిద్దినట్లు చెప్పారు. కంప్యూటరైజేషన్‌తోపాటు ఆధునాతన టెక్నాలజీతో బ్యాంకు ఖాతాదారులకు సేవలందిస్తున్నట్లు చెప్పారు. డీసీసీబీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని, తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని మనోహర్‌రెడ్డి ఈ సందర్భంగా కోరారు.

నిత్యావసర సరుకుల అందజేత

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీలో పనిచేస్తూ ఇటీవల మృతిచెందిన పారిశుద్ధ్య కార్మికురాలు జంతుక సుమతమ్మ కుటుంబానికి ఆమనగల్లు అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు ఒగ్గు మహేశ్ ఆర్థికసాయం అందించారు. సుమతమ్మ కుటుంబ సభ్యులను బుధవారం మహేశ్ పరామర్శించారు. బియ్యం, నిత్యావసర సరుకులను అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కుమార్, మహేశ్, శివ, శ్రీను, మహేశ్, అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ అభివృద్ధికి కృషిచేయాలి

బ్రాంచ్ మేనేజర్ లక్ష్మీకాంత్‌నాయక్


పూజా కార్యక్రమంలో ఎల్ఐసీ సిబ్బంది

ఇబ్రహీంపట్నం: ఎల్ఐసీ అభివృద్ధికి ఏజెంట్లు కృషిచేయాలని ఇబ్రహీంపట్నం శాటిలైట్ బ్రాంచ్ మేనేజర్ లక్ష్మీకాంత్‌నాయక్ తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సర వ్యాపార లావాదేవీల ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకోని బుధవారం స్థానిక బ్రాంచ్ కార్యాలయంలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అధిక పాలసీలు తీసుకువచ్చి సంస్థ అభివృద్ధికి పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ ఏఓలు అంజనీకుమార్, కవిత, డీఓలు ఆదిత్య, ప్రకాష్, ఏజెంట్లు శ్రీనివాస్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, మల్లేశ్, సాయిలు, ధనుంజయ, అర్జున్, ఆంజనేయులు, శ్రీధర్ పాల్గొన్నారు.

ముద్వీన్‌లో కంటివెలుగు శిబిరం


కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న దశరథ్‌నాయక్

కడ్తాల్: కంటి వెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ముద్వీన్ గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని గ్రామ సర్పంచ్ యాదయ్యతో కలిసి జెడ్పీటీసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందని అన్నారు. కంటి సమస్యతో బాధపడుతున్న వారికి ఈ శిబిరాల్లో కళ్లద్దాలతోపాటు, అవసమైనవారిక కంటి సర్జరీలను చేయిస్తోందన్నారు. గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్త, రైతుబంధు మండల అధ్యక్షుడు వీరయ్య, ఉపసర్పంచ్ వినోద్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటయ్య, నాయకులు రాజు, జంగయ్య, వైద్య సిబ్బంది ఉన్నారు.

బ్యాంకు రుణ పరిమితి పెంచండి

ఎంపీపీ కొప్పు సుకన్య


యాచారం: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుకన్య

యాచారం: డ్వాక్రా సంఘాలకు ఇచ్చే రుణాల్లో రుణ పరిమితిని పెంచి సక్రమంగా వాయిదాలు చెల్లించే సంఘాలకు రూ.25 లక్షల రుణం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ కొప్పు సుకన్య సూచించారు. మండల కేంద్రంలో స్త్రీశక్తి భవనంలో బుధవారం మండల మహిళా సమాఖ్య కార్యనిర్వాహక కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... డ్వాక్రా సంఘాలకు ఇస్తున్న రూ.లక్ష నుంచి రూ.5లక్షల వరకు రుణాలు ఏ వ్యాపారం చేసుకోవాలన్నా సరిపోవడం లేదన్నారు. ప్రతి డ్వాక్రా సంఘానికి రూ.25 లక్షల వరకు రుణాలు ఇస్తే స్వయం ఉపాధికి ఖర్చు చేసుకునే అవకాశం ఉంటుందని అన్నారు. గ్రామాల్లో డ్వాక్రా సంఘాల సమావేశాలు సక్రమంగా జరిగేలా కృషి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ విజయలక్ష్మీ, మహిళా సమాఖ్య మండల అధ్యక్షురాలు పద్మ, ఐకేపీ ఏపీఎం సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం


రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ కృపేశ్

ఇబ్రహీంపట్నం రూరల్: గ్రామాల అభివృద్ధికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీపీ పీ.కృపేశ్ తెలిపారు. ఇబ్రహీంపట్నం మండలం పరిధిలోని పోల్కంపల్లి అనుబంధ గ్రామమైన జాజోనిబాయిలో డీఎంఎఫ్ నిధులు రూ.7లక్షలతో సీసీరోడ్డు నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్ చెరుకూరి ఆండాలు, ఎంపీటీసీ చెరుకూరి మంగ రవీందర్‌తో కలిసి ఎంపీపీ ప్రారంభించారు. ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సహకారంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జంగారెడ్డి, కోఆప్షన్ సభ్యుడు షరీఫ్, ఏఈ ఇంద్రాసేనారెడ్డి, వార్డుసభ్యులు స్వరూప, బాలకిషన్, మనెమ్మ, యాదగిరిరెడ్డి, మల్లమ్మ, బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు దానయ్యగౌడ్, నాయకులు.. నర్సింహా, స్వామి, యాదయ్య, రాజు, విఘ్నేష్, ఐలయ్య, లక్ష్మణ్, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత


నగదు అందజేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

ఇబ్రహీంపట్నం రూరల్: నిరుపేద కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఆ పార్టీ ఇబ్రహీంపట్నం మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కొడూరి రమేష్ తెలిపారు. బుధవారం ఇబ్రహీంపట్నం మండలం పరిధిలోని తులేకలాన్ గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన దార శంకరయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన కుటుంబానికి రూ.6వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో దాచేపల్లి సాయి, జంగయ్య, నర్సింహ, పాండు, నర్సింహ, ప్రవీణ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదాతలు కండి

సీవీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి


రక్తదానం చేస్తున్న యువకులు

ఇబ్రహీంపట్నం రూరల్: రక్తదానం ప్రాణదానంతో సమానమని సీవీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలో మంగళ్‌పల్లి సమీపంలో గల సీవీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సీవీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. రక్తదానం చేయడం ద్వారా గుండె జబ్బులను నివారించవచ్చని తెలిపారు. శరీరంలో ఐరన్ స్థాయి నియంత్రణలో ఉంటుందని అన్నారు. రక్తంలో అధిక స్థాయిలో ఐరన్ ఉంటే అది రక్తనాలాలను అడ్డుకుంటుందని తద్వారా రక్త ప్రసరణ దెబ్బతీస్తుందన్నారు. గుండె జబ్బుల ప్రమాదాన్ని పెంచుతుందని హిమెక్రోటోసిస్ అనే వ్యాధికి కారణమవుతుందన్నారు. కాగా శిబిరంలో 250 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్స్‌పాల్ ప్రొఫెసర్ శివారెడ్డి, డీన్ డాక్టర్ నయనతార, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ప్రమోద్, రెడ్ క్రాస్ సొసైటీ డాక్టర్లు వేణుగోపాల్, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

'పట్నం'లో ఇఫ్తార్ విందు


ఇఫ్తార్ విందులో ప్రశాంత్‌కుమార్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: రంజాన్ ఉపవాస దీక్షలను పురస్కరించుకోని ఇబ్రహీంపట్నంలో బుధవారం ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. కోఆప్షన్ మెంబర్ ముబీన్ ఇచ్చిన ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి తనయుడు, బీఆర్‌ఎస్ యువనేత మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనలు చేశారు. కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ శ్రేణులు, బంటి యూత్ ఫోర్స్ సభ్యులు పాల్గొన్నారు.

వెల్జాల్‌లో..

తలకొండపల్లి: పండుగలు మత సామరస్యానికి ప్రతీకలని మాజీ ఎంపీపీ శ్రీనివాసుయాదవ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని వెల్జాల్‌లో ఆయన ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ.ముజీబర్ రహ్మాన్, దస్తగిరి, ఉప సర్పంచ్ అజీజ్, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అవగాహన


అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ సుజాతానాయక్

హస్తినాపురం: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు తగు జాగ్రత్తలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ సూచించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించే నిమిత్తం జీహెచ్ఎంసీ అధికారులతో శ్రీకృష్ణానగర్‌కాలనీలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కార్పొరేటర్ సుజాతానాయక్ మాట్లాడుతూ... ప్రతి కాలనీలోని ఖాళీ స్థలాలు, రోడ్ల పక్కన చెత్తాచెదారం వేయరాదని కాలనీవాసులను కోరారు. కార్యక్రమంలో ఏఈ హేమూనాయక్, జలమండలి మేనేజర్ రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రేవతి, బీఆర్‌ఎస్ నాయకులు గోపీరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, బిక్కునాయక్ తదితరులు పాల్గొన్నారు.